క్లుప్తంగా

గోపినాథ్‌కు నివాళి



నివాళి అర్పిస్తున్న భూపేష్

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక సంతపేట కూడలిలో మాజీ ఎమ్మెల్యే, మాజీ డీసీసీ అధ్యక్షుడు దివంగత గోపినాథ్ జయంతి సందర్భంగా నివాళి అర్పించారు. ఆయన కుమారుడు వైఎస్సార్‌సీపీ నాయకుడు భూపేష్ ఆధ్వర్యంలో గురువారం గోపినాథ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం అన్నదానం చేశారు. గోపినాథ్ చేసిన సేవలను భూపేష్, పలు సంఘాల నాయకులు కొనియాడారు. తండ్రి పాలనలో చిత్తూరులో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు చిట్టి, శ్రీనివాసులు, విజయ్ కుమార్, శివ, శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

వరసిద్ధుని సేవలో రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి



కాణిపాకంలో రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా

కాణిపాకం: రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా గురువారం కుటుంబ సమేతంగా కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దర్శించుకున్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆయనకు ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం కల్పించారు. అనంతరం వేద ఆశీర్వచన మండపంలో కలెక్టర్ సన్మానించారు. పండితుల ఆశీర్వచనాలు చేశారు. ప్రసాదం, చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మురళీమోహన్, ఈఓ పెంచలకిషోర్, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, ఎక్సైజ్ శాఖ ఈఎస్ శ్రీనివాస్, నాగమల్లేశ్వర్, డీఎస్పీ వాసుదేవచౌదరి, ఆలయ ఏఈఓ రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికుడి కుటుంబానికి ఆర్థికసాయం



మృతుడి కుటుంబ సభ్యుల్ని ఓదారుస్తున్న లోకేష్

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ విధులు నిర్వర్తిస్తూ మృతి చెందిన రెడ్డెప్ప అనే కార్మికుడి కుటుంబాన్ని ప్రజారోగ్య శాఖ అధికారి డా.లోకేష్ పరామర్శించారు. గురువారం కొత్రకోనకు వెళ్లి రెడ్డెప్ప మృతదేహానికి నివాళులర్పించారు. దహన క్రియల నిమిత్తం అతని కుటుంబ సభ్యులకు రూ.15 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ప్రజారోగ్యశాఖ అధికారి వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ లోకనాథం, ఉద్యోగ సంఘ నాయకులు ఉన్నారు.

విత్తనశుద్ధి తప్పక చేయించాలి



స్వస్తిక్ నగర్‌లో పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్న ఏఓ ప్రవీణ్

తవణంపల్లె: నారు పోసేటప్పుడు విత్తన శుద్ధి తప్పక చేయించాలని వ్యవసాయాధికారి జి. ప్రవీణ్ తెలిపారు. మండలంలోని స్వస్తిక్ నగర్, రామనాథపురంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పంటల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాధికారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై రైతులు మక్కువ చూపాలన్నారు. రసాయనిక ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువులు బాగా వాడాలని చెప్పారు. నారు పోసేటప్పుడు విధిగా విత్తన శుద్ధి చేస్తే చీడలు, పురుగులను నివారిస్తుందని వివరించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

తవణంపల్లె: అంటువ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి వినయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని ముట్టుకూరులో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ వినయ్‌కుమార్ 35 మంది రోగులకు పరీక్షలు నిర్వహించారు. గర్భవతులు, బాలింతలు, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులు ఆస్పత్రిలో ప్రసవం తల్లీబిడ్డకు క్షేమమని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పదికి వంద ప్రణాళిక





బంగారుపాళెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, స్టడీ అవర్స్‌లో చదువుతున్న విద్యార్థినులు

- టెన్త్‌లో ఉత్తమ ఫలితాలకు ప్రత్యేక బోధన
- ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతుల నిర్వహణ
- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

బంగారుపాళెం: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు పదో తరగతి కీలకం. ఉన్నత చదువులకు పునాది రాయిగా భావించే పదో తరగతి పరీక్షలపై అటు ఉపాధ్యాయులు, ఇటు తల్లిదండ్రులు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడమే లక్ష్యంగా విద్యాశాఖ వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక విడుదల చేసింది. ఈ మేరకు మార్గదర్శకాలు జారీ చేయడంతో రెండో శనివారం, ఆదివారాల్లో సైతం అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. డిసెంబరు 1వ తేదీ నుంచి దీన్ని అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించడంతో పాటు మిగిలిన విద్యార్థులు మంచి మార్కులు సాధించేలా దృష్టి సారిస్తున్నారు. విద్యార్థుల అభ్యసన స్థాయి పెరగడంతోపాటు వారిలో ఆత్మస్థైర్యం పెంపొందించడానికి ఈ ప్రణాళిక ఎంతో దోహదపడుతోందని విద్యాశాఖ వర్గాలు భావిస్తున్నాయి.

వచ్చే సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో జరగనున్న పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలనే ఉద్దేశంతో డిసెంబరు నుంచి మార్చి వరకు వంద రోజుల ప్రణాళికను అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆయా సబ్జెక్టుల టీచర్లు విద్యార్థులకు ప్రత్యేక సూచనలు ఇస్తున్నారు. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతి పబ్లిక్ పరీక్షల తేదీలు ఖరారయ్యాయి. వచ్చే ఏడాది మార్చి 17 నుంచి 31 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. మండలంలో 13 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 581 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్నారు. గతంలో వచ్చిన ఫలితాలను బేరీజు చేసుకుని మరింత మెరుగైన ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. రోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అసైన్‌మెంట్స్ నిర్వహిస్తున్నారు.



ప్రత్యేక తరగతుల్లో విద్యార్థుల అభ్యాసం

మండలంలో పదో తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులు పాఠశాలల వారీగా..

పాఠశాల పేరు	బాలురు	బాలికలు	మొత్తం
జీహెచ్‌ఎస్ బంగారుపాళెం -	71	97	168
జెడ్పీహెచ్‌ఎస్ రాగిమానుపెంట -	43	35	78
జెడ్పీహెచ్‌ఎస్ తుంబకుప్పం -	35	21	56
జెడ్పీహెచ్‌ఎస్ మంగళపల్లె -	24	26	50
జెడ్పీహెచ్‌ఎస్ టేకుమంద -	25	18	43
జెడ్పీహెచ్‌ఎస్ గుండ్లకట్టమంచి -	20	22	42
జెడ్పీహెచ్‌ఎస్ మొగిలిమిట్టూరు -	20	20	40
జెడ్పీహెచ్‌ఎస్ బోడబండ్ల -	15	11	26
జెడ్పీహెచ్‌ఎస్ పిడివికండ్రిగ -	11	09	20
జెడ్పీహెచ్‌ఎస్ తుంబపాళెం -	14	05	19
జెడ్పీహెచ్‌ఎస్ తంబుగానిపల్లె -	05	05	10
ఎస్టీ గురుకులపాఠశాల(బాలురు) -	15	00	15
ఎస్‌వీఎస్ నల్లంగాడు -	04	10	14

స్టడీ అవర్స్‌తో ఉపయోగం



ఉదయం, సాయంత్రం పూట నిర్వహించే స్టడీ అవర్స్ ఉపయోగకరంగా ఉన్నాయి. ప్రతి అంశాన్ని ఉపాధ్యాయుల నుంచి నేర్చుకుంటున్నాం. విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపుతున్నారు. స్టడీ అవర్స్ ఉపయుక్తంగా ఉన్నాయి, మంచి మార్కులు తెచ్చుకుని పాఠశాలకు గుర్తింపు తీసుకువస్తాం.
–సాధ్వీశ్రీ, బంగారుపాళెం

ప్రణాళికతో బోధన



పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకు ప్రత్యేక ప్రణాళిక ప్రకారం మాకు ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. ఉపాధ్యాయుల ప్రోత్సాహం ఎంతో బాగుంది. ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందిస్తున్నారు. నేను మంచి ఫలితాలు సాధించేందుకు ఉత్సాహంగా చదువుకోవడానికి సహకరిస్తున్నారు.
–ఇందుప్రియ, బంగారుపాళెం

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



పదిలో వెనుకబడిన విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. ఉదయం, సాయంత్రం నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల ద్వారా సందేహాలను నివృత్తి చేస్తున్నారు. సులభ పద్ధతుల ద్వారా పాఠ్యాంశాలను అర్థం చేసుకుని పబ్లిక్ పరీక్షలకు ఎలా ప్రిపేర్ కావాలి అనే అంశాలపై సూచనలు చేస్తున్నారు.
– లోకేష్, బంగారుపాళెం

సబ్జెకుల వారీగా బోధన



పదో తరగతి ఉదయం 8 నుంచి 9 వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. సబ్జెక్టుల వారీగా వంద రోజుల ప్రణాళిక ద్వారా బోధన చేస్తున్నాం. ఇంటి వద్ద ఎలా చదవాలి అనే విషయాలను గురించి చెబుతున్నాం. కష్టమైన సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం.
–రోజా రమణి, హిందీ పండిట్, బంగారుపాళెం

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి



పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించే దిశగా కృషి చేస్తున్నాం. వంద రోజుల ప్రణాళికను అమలు చేస్తూనే సెలవు రోజుల్లోనూ అదనపు తరగతులు నిర్వహిస్తున్నాం. విద్యార్థుల సామర్థ్యాల ఆధారంగా వెనుకబడిన వారిని ప్రత్యేక శ్రద్ధతో చదివిస్తున్నాం.
–జనార్దన్‌రెడ్డి, ఇన్‌చార్జి హెచ్‌ఎం, జీహెచ్‌ఎస్, బంగారుపాళెం

నేటి పోరుబాటను జయప్రదం చేయండి



విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ సర్దుబాటు చార్జీల పెంపునకు నిరసనగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పోరుబాట కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమానికి నాయకులు, వినియోగదారులు పాల్గొని జయప్రదం చేయాలని ఆ పార్టీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జి విజయానందరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక కట్టమంచి చెరువు సమీపంలోని వివేకానంద విగ్రహం వద్ద నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. ఉదయం 9.30 గంటలకు నియోజకవర్గ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, వినియోగదారులు అక్కడికి చేరుకోవాలన్నారు. తర్వాత ప్లకార్డుల ప్రదర్శనతో ర్యాలీగా గాంధీరోడ్డులోని ట్రాన్స్‌కో డీఈ కార్యాలయానికి చేరుకుంటామన్నారు. తదుపరి అక్కడ నిరసన వ్యక్తం చేసి డీఈకు వినతిపత్రం అందించనున్నట్లు వివరించారు.

పూతలపట్టులో ఏఈ కార్యాలయం వరకు ర్యాలీ..

కాణిపాకం: కరెంట్ చార్జీల బాదుడుపై వైఎస్సార్‌సీపీ చేపడుతున్న పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు పూతలపట్టులో శుక్రవారం ఉదయం కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. అంబేడ్కర్ విగ్రహం నుంచి విద్యుత్‌శాఖ ఏఈ కార్యాలయానికి ర్యాలీగా వెళుతున్నామన్నారు. అక్కడ ఏఈకి కరెంట్ చార్జీల పెంపుపై వినతి పత్రం అందజేస్తామన్నారు. నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ప్రజలు, రైతులు పాల్గొనాలని ఆయన పేర్కొన్నారు.

ఇరుక్కుపోయిన బస్సు

యాదమరి (కాణిపాకం): యాదమరి మండలం జోడిచింతల నుంచి కనికాపురం వెళ్లే మార్గంలో ఓ ప్రైవేటు బస్సు ఇరుక్కుపోయింది. కురిసిన వర్షానికి గుంతలో బస్సు చక్రాలు కూరుకుపోయాయి. బస్సును గుంతలో నుంచి నెట్టడానికి స్థానికులు, బస్సులోని ప్రయాణికులు కుస్తీ పట్టారు. అప్పటికీ కుదరకపోవడంతో జేసీబీని తీసుకొచ్చి బస్సును గుంతలో నుంచి కదిలించారు.

జాతీయ సేవా పథకం ప్రారంభం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ రెడ్డి రాము

ఐరాల: మండలంలోని 35 యర్లంపల్లెలో చిత్తూరు ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో తిరుపతి వ్యవసాయ కళాశాల విద్యార్థులు గురువారం జాతీయ సేవా పథకం కార్యక్రమాన్ని ప్రారంభిచారు. గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా చిత్తూరు ఏరువాక కేంద్రానికి సంబంధించిన విద్యార్థులు గ్రామంలో అవగాహన కల్పించనున్నారు. ముఖ్య అతిథిగా ఎస్‌వి వ్యవసాయ కళాశాల తిరుపతి అగ్రానమీ ప్రొఫెసర్ వై రెడ్డిరాము పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో జాతీయ సేవా పథకం విద్యార్థులు గ్రామంలో వారం రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాల గురించి వివరించారు. జంతు ఆరోగ్యం, గ్రామస్తులకు ఆరోగ్య శిబిరం, రైతు సదస్సు ప్రదర్శన సంస్థ, స్వచ్ఛతా హీ సేవపై ప్రచారం, సే నో టు ప్లాస్టిక్‌పై ప్రచారం, వనమహోత్సవం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ రైతులు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎస్‌వి వ్యవసాయ కళాశాల తిరుపతి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లావణ్య మాట్లాడుతూ జాతీయ సేవా పథకం వలన కలిగే ప్రయోజనాలు గురించి వివరించి విద్యార్థులను ప్రోత్సహించారు. కార్యక్రమంలో వీఏఏ జోత్స్న, రైతులు పాల్గొన్నారు.

బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించండి



అధికారులతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో రవి ప్రకాష్‌నాయుడు

పూతలపట్టు (కాణిపాకం): మండల అధికారులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని జెడ్పీ సీఈవో రవిప్రకాష్‌నాయుడు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి అధికారి కచ్చితంగా క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. నీటి ట్యాంకులను శుభ్రం చేయాలని చెప్పారు. పారిశుధ్యంపై దృష్టి సారించాలన్నారు. తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన సూచించారు.

చేతివృత్తులపై ఉచిత శిక్షణ

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్‌లోని పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో ఆసక్తి ఉన్న నిరుద్యోగులకు చేతివృత్తులపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కమిషనర్ నరసింహ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్లంబర్, వడ్రంగి, ఎలక్ట్రీషియన్, టీవీ–వాషింగ్‌మెషీన్–ఏసీ రిపేర్లు, బ్యూటీషియన్ లాంటి ఏ రంగంలో ఆసక్తి ఉంటే.. అందులో ఉచిత శిక్షణ ఇవ్వడంతో పాటు అవకాశాలు కూడా కల్పిస్తామన్నారు. అభ్యర్థులు శనివారం నుంచి ఈనెల 31వ తేదీ వరకు కార్పొరేషన్ కార్యాలయంలోని మెప్మా విభాగంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు ఫోన్–7780285604ను సంప్రదించాలన్నారు.

28న పుత్తూరులో జాబ్ మేళా

పుత్తూరు: పట్టణంలోని ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 28న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ వి.వీరయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుంచి నిర్వహించే మెగా జాబ్ మేళాలో 9 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. జాబ్ మేళాలో ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, బీటెక్ చదివిన 18 నుంచి 30 ఏళ్ల అభ్యర్థులు అర్హులని వెల్లడించారు. అభ్యర్థులు బయోడేటాతో పాటు సర్టిఫికెట్స్, ఐడీ ప్రూఫ్, రెండు ఫొటోలతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని వివరించారు. ఇతర వివరాలకు 9848553724ను సంప్రదించాలని ఆయన కోరారు.

పేదలకు అండగా ఎర్రజెండా



ర్యాలీగా వస్తున్న రామానాయుడు, సీపీఐ నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: పేద, కార్మిక, కర్షకులకు 99 ఏళ్లుగా అండగా ఉన్న పార్టీ సీపీఐ అని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ.రామానాయుడు అన్నారు. చిత్తూరు నగరంలో గురువారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శతాబ్ది ఉత్సవంలో భాగంగా నగరంలో ర్యాలీ నిర్వహించారు. కోర్టు వద్ద నుంచి గాంధీ విగ్రహం వరకు ఎర్ర జెండాలతో ప్రదర్శనగా వచ్చి కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో పార్టీని ప్రారంభించిన విషయం గుర్తు చేశారు. నాడు సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం అలుపెరిగిన పోరాటం చేసి పలువురు జైల్లుకి వెళ్లి, ప్రాణాలు త్యాగాలు చేశారన్నారు. దేశంలో అందరికీ విద్య, ఉపాధి, కార్మిక హక్కులు, భూ సంస్కరణలు, అంటరానితనం వంటి సమస్యలపై పోరాడి పలు చట్టాలు సాధించామన్నారు. నిజాం పాలనకు వ్యతిరేకంగా నడిపిన సాయుధ పోరాటంలో 4 వేల మంది కమ్యూనిస్టులు ప్రాణాలు కోల్పోయారన్నారు. ఆ పోరాటంతో 10 లక్షల ఎకరాల భూమి పంపిణీ జరిగిందన్నారు. భాషా సంయుక్త రాష్ట్రాల కోసం తమ వంతు పోరాటాలు చేశామన్నారు. తమ పార్టీ పోరాటాలతో దేశంలో బ్యాంకుల జాతీయకరణ, గరిష్ఠ పరిమితి చట్టాలు వచ్చాయన్నారు. నేడు దేశంలో అభివృద్ధి నిరోధక శక్తుల పాలనలో హక్కులు హరించుకుపోతున్నాయన్నారు. దేశ సంపద మొత్తం కొందరి కార్పొరేట్ సంస్థల పరం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్ నాగరాజ్, సహాయ కార్యదర్శి డా.టి.జనార్దన్ నాయకులు గోపినాథ్, మణి, దాసరిచంద్ర, విజయకుమార్, రఘు, దామోదరం, మంజునాథ్ బాబు, మున్నా, విజయ్ గౌరి, రమాదేవి, కుమారి, జమీలాబి పాల్గొన్నారు.

పారిశుద్ధ్యానికి పెద్ద పీట



ట్యాంకును శుభ్రం చేస్తున్న కూలీలు

శ్రీరంగరాజపురం: పంచాయతీలో పారిశుద్ధ్యం మెరుగుకు పెద్దపీట వేస్తున్నట్టు సర్పంచ్ వరదమ్మ తెలిపారు. గురువారం మండలంలోని తయ్యూరు గ్రామ పంచాయతీ గ్రామాలన్నింటా ఓవర్‌హెడ్ ట్యాంకులను శుభ్రం చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందుస్తు చర్యలు తీసుకుంటున్నట్టు ఆమె చెప్పారు. వర్షాల నేపథ్యంలో గ్రామాల్లో కాలువల్లో పేరుకపోయిన మురుగు, చెత్తాచెదారాన్ని తొలగించి అంటువ్యాధులు ప్రబలకుండా చేస్తున్నామన్నారు. ఉత్తమ పంచాయతీగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జ్యోత్స్న, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దోమకాటు పశువుకు చేటు

- అనారోగ్యం పాలవుతున్న పశువులు
- అవగాహన పెంచుకోకపోతే పశుసంపదకు నష్టం



పాడి ఆవులు

గుడిపాల: దోమల కారణంగా మనుషులే కాదు పశువులు కూడా అనారోగ్యం పాలవుతాయి. ఈ పరిస్థితిని ముందుగానే అధిగమిస్తే మూగజీవాలను ఆరోగ్యవంతంగా చూసుకోవచ్చు. అకాల వర్షాలు కురుస్తుండడంతో పల్లపు ప్రాంతాలు, ఖాళీ స్థలాల్లో వర్షపునీరు నిలిచిపోయి దోమలు వృద్ధి చెందుతున్నాయి. దోమకాటు వల్ల మనుషులతోపాటు పశువులు కూడా రోగాలబారిన పడుతాయి. దీంతో పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గిపోతుంది. ఒక్కోసారి పశువులు ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుంది. చిత్తూరు నియోజకవర్గంలో పాడి సంపదకు కొదవ లేదు. మొత్తం పాడి ఆవులు 22 వేల పైచిలుకు ఉన్నాయి. ప్రస్తుత సీజన్‌లో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోకపోతే పాడి పశువులే గొంతువాపు, దొమ్మ, గాలికుంటు తదితర వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. పశువుల్లో వ్యాధి లక్షణాలను గుర్తించిన వెంటనే పశువైద్య సిబ్బందిని సంప్రదించి సరైన చికిత్స అందివ్వాలని వైద్యులు సూచిస్తున్నారు.

దోమకాటుతో వచ్చే సమస్యలు

- పశువులను దోమలు ఎక్కువగా కుట్టడంతో అవి మేతసరిగ్గా తీసుకోకపోవడంతపాటు ఆకలి మందగించడం జరుగుతుంది. ఈ ప్రభావంతో పాల దిగుబడి తగ్గిపోతుంది.
- పశువు శరీర ఉష్ణోగ్రత పెరిగిపోవడంతో రోజురోజుకూ బలహీనపడుతోంది.
- దోమలు కుట్టిన చోట పుండ్లు ఏర్పడతాయి.
- పశువులకు మేతవేసే ప్రాంతం అంతా శుభ్రంగా లేకుంటే దోమలు చేరి పశువులు మేత తినే సమయంలో వాటిని బాధిస్తాయి. దీంతో మేత కూడా సరిగ్గా తీసుకోలేవు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పశువులను ఉంచే పాకలో దోమలు ప్రవేశించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. దోమ తెరలు వాడటం శ్రేయస్కరం. సాయంత్రం పశువులను పాకలో కట్టేముందు వేప ఆకులు లేదా సాంబ్రాణితో పొగ పెట్టాలి. పశువుల శాలల చుట్టూ వ్యర్థాలు, పొదలు లేకుండా శుభ్రం చేసుకోవాలి. పశువులు కట్టేసిన ప్రాంగణాన్ని రోజూ శుభ్రం చేసుకోవాలి.

అపరిశుభ్రతతో సమస్య



పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో పాడి రైతులు తగు జాగ్రత్తలు పాటించాలి. పశువుల పాకలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. మేత, దాణాకు అందించే పాత్రలు శుభ్రం చేయాలి. వైద్యుల సలహామేరకు ఎప్పటికప్పుడు అవసరమైన టీకాలు, మందులు అందించాలి. దోమకాటు వలన ప్రమాదకరమైన వ్యాధుల బారిన పడే అవకాశాలు ఉన్నాయి. పశువులకు సంక్రమించే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పశువైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.
–సాయిసుధ, పశువైద్యాధికారి, గుడిపాల

మోగిన బార్ ఎన్నికల నగారా

- 3న చిత్తూరు బార్ అసోసియేషన్ ఎన్నికలు
- అధ్యక్ష పదవితో సహా.. 28 మంది నామినేషన్లు దాఖలు
- నేడు పరిశీలన, రేపు ఉప సంహరణ



చిత్తూరు బార్ అసోసియేషన్ కార్యాలయంలో నామినేషన్లు తీసుకుంటున్న న్యాయవాదులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు న్యాయవాద సంఘం (బార్) ఎన్నికల నగారా మోగింది. నగరంలోని జిల్లా న్యాయస్థానాల సముదాయంలో పనిచేస్తున్న న్యాయవాదుల సంఘానికి ఎన్నికలు నిర్వహించడానికి నోటిఫికేషన్ విడుదల చేశారు. గురువారం నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలు కావడం, పూర్తవడం కూడా జరిగిపోయింది. కాగా బార్ అసోసియేషన్‌లో మొత్తం 12 పోస్టులుండగా అధ్యక్ష, కార్యదర్శితో సహా 28 మంది న్యాయవాదులు నామినేషన్లు దాఖలు చేశారు. అధ్యక్ష పదవికి ఐదుగురు, కార్యదర్శికి ముగ్గురు, ఉపాధ్యక్ష పదవికి ఇద్దరు, కోశాధికారి, సాంస్కృతిక కార్యదర్శి పదవులకు ముగ్గురు చొప్పున, లైబ్రరీ కార్యదర్శికి ఇద్దరు, సీనియర్–జూనియర్ కార్యనిర్వాహక సభ్యులుగా నలుగురు చొప్పున నామినేషన్లు దాఖలు చేశారు. ఇక సంయుక్త కార్యదర్శి, క్రీడా కార్యదర్శుల స్థానాలకు ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలు కావడంతో అవి ఏకగ్రీవం అయ్యే అవకాశం కనిపిస్తోంది. శుక్రవారం నామినేషన్ల పరిశీలన పూర్తి చేసి, బరిలో ఉన్న న్యాయవాదుల వివరాలు ప్రకటిస్తారు. శనివారం నామినేషన్ల ఉపసంహరణ పూర్తయ్యాక.. అదే రోజు తుదిగా బరిలో ఉన్న అభ్యర్థుల వివరాలు ప్రకటించనున్నట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న సీనియర్ న్యాయవాది వసంతకుమార్ తెలిపారు. జనవరి 3వ తేదీన బార్ అసోసియేషన్‌కు ఎన్నికలు, అదే రోజు ఫలితాల వెల్లడి జరుగుతుంది. దాదాపు 339 మంది ఓటర్లుగా ఉన్నారు. ఎన్నికల ప్రక్రియను బార్ కార్యదర్శి అశోక్ ఆనంద్ యాదవ్, మరో న్యాయవాది రఘురామ్ పర్యవేక్షించారు.